

నేడు గురు పౌర్ణమి

విజయనగరంరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలు జరగనున్నాయి. దీని కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. విజయనగరంలోని ధర్మపురి రోడ్డు, న్యూపూర్ణ, పాతబస్టాండ్, ఉడాకాలనీ, పూల్‌బాగ్ కాలనీ, పల్లివీధి, బాబామెట్టతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో క్షీరాభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకూ ఈ కార్యక్రమం జరగనుంది. అనంతరం సాయంత్రం వరకూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

బదిలీలలు

- కోరుకున్నది ఒకస్థానం.. కేటాయించింది మరోస్థానం
- ఉత్తర్వులు చూసి ఖంగుతిన్న సచివాలయ ఉద్యోగులు
- సిఫారసులకే పెద్దపీట వేశారని గగ్గోలు
- కొన్ని విభాగాల్లో అమలుకాని నిబంధనలు
- సమస్యను విన్నవించుకునేందుకు కలెక్టరేట్‌కు రాక



● సాలూరు మండలం కరకవలస సచివాలయంలో వెటర్నీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చుక్క మణికంఠ ఐదేళ్ల సర్వీసు పూర్తి కావడంతో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పాచిపెంట, మక్కువ, రామభద్రపురం మండలాల్లో పోస్టింగ్ కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. కానీ, ఆయనకు ఈ మూడు మండలాల్లో కాకుండా జామి మండలం లోట్లపల్లి సచివాలయానికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో వెటర్నీ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికైనప్పుడు మణికంఠకు 47 ర్యాంకు వచ్చింది. ఇప్పుడు బదిలీలకు వచ్చే సరికి ఆయన కంటే ఎక్కువ ర్యాంకు వచ్చిన వారికి నచ్చిన స్థానం కేటాయించారు. దీంతో మణికంఠ తన సమస్యను కలెక్టర్‌కు చెప్పుకోవడానికి గత రెండురోజుల నుంచి కలెక్టర్‌రేట్ చుట్టూ తిరుగుతున్నారు. బదిలీల్లో కనీసం నిబంధనలు పాటించకుండా సిఫారసులకు పెద్దపీట వేశారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● తెర్లాం మండలం బి.చిన్నయ్యపేట సచివాలయంలో ఐదేళ్ల పాటు పని చేసిన ఓ మహిళా డిజిటల్ అసిస్టెంట్ స్పౌజ్ కోటా కింద విజయనగరం మండలానికి బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఆమె తండ్రి ఉద్యోగ రీత్యా విజయనగ రంలో ఉంటున్నారు. దీంతో విజయనగరం సొంత మండలం కింద వస్తుందని, వేరే మండలానికి దరఖాస్తు చేసుకోవాలని ఉన్నతాధికారులు చెప్పారు. దీంతో ఆమె బొండపల్లి మండలం గొట్లాం సచివాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆమెకు గొట్లాం కాకుండా కనిమెరక సచివాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం కనిమెరక సచివాలయంలో ఓ మహిళ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈమె ఇక్కడకు వచ్చి నాలుగు నెలలే అయ్యింది. ఈమె రిక్వెస్టు బదిలీకి మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తనకు స్పౌజ్ కోటా అవకాశం రాకుండా పోయిందని బి.చిన్నయ్యపేట సచివాలయ మహిళా డిజిటల్ అసిస్టెంట్ ఆవేదన చెందుతున్నారు.

● నెల్లిమర్ల మండలంలోని ఓ సచివాలయానికి చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ బదిలీపై గుర్ల మండలానికి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్ సమయంలో గుర్ల మండలంలోని ఆనందపురం సచివాలయాన్ని ఆయన కోరుకున్నారు. దీంతో ఆ స్థానాన్ని అధికారులు ఓకే చేశారు. అయితే, బదిలీ ఉత్తర్వుల్లో మాత్రం ఆనందపురం కాకుండా మరో సచివాలయం పేరు ఉండడంతో సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఖంగుతిన్నారు. తన సమస్యను చెప్పుకోవడానికి బుధవారం కలెక్టరేట్‌కు వచ్చారు.

● కొత్తవలస మండలం తుమ్మికాపల్లి సచివాలయంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఓ అగ్రికల్చర్ అసిస్టెంట్ బదిలీ కోసం ఎల్.కోట మండలానికి దరఖాస్తు చేసుకున్నారు. గత నెలలో కౌన్సెలింగ్‌జరగ్గా ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట సచివాలయాన్ని ఆ అగ్రికల్చర్ అసిస్టెంట్ కోరుకున్నారు. కానీ, మంగళవారం రాత్రి విడుదలైన ఉత్తర్వుల్లో మాత్రం జమ్మాదేవిపేట కాకుండా, మెంటాడ మండలంలోని ఓ సచివాలయం పేరు ఉంది. దీంతో తన సమస్యను కలెక్టర్‌కు విన్నవించుకోవడానికి అగ్రికల్చర్ అసిస్టెంట్ బుధవారం వచ్చారు.



కలెక్టరేట్ వద్ద నిరీక్షిస్తున్న మహిళా పోలీసులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు



విజయనగరం కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో చిత్ర, విచిత్రాలు చోటుచేసుకున్నాయి. బదిలీల కౌన్సెలింగ్‌లో ఉద్యోగులు ఒక సచివాలయాన్ని కోరుకుంటే, ఉత్తర్వుల్లో మాత్రం మరో సచివాలయం పేరు ఉంటుంది. దీంతో సంబంధిత ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బదిలీల్లో నిబంధనలు పక్కన పెట్టి సిఫారసులకు పెద్దపీట వేసినట్లు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 664 గ్రామ, 134 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో 5,452 మంది పని చేస్తున్నారు. 726 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకేచోట ఐదు సంవత్సరాలు పని చేసిన వారు 3,571 మంది ఉన్నారు. వీరంతా (మిగతా 8వ పేజీలో..)

ఇసుక తోడేస్తున్నారు

- చంపావతి నది, ఏడోంపుల గెడ్డలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- ఉచితం పేరిట అక్రమంగా రవాణా
- ఏకమైన అధికార, ప్రతిపక్ష నేతలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- తూతూమంత్రంగా అధికారుల దాడులు



తుమ్మికాపల్లి వద్ద చంపావతి నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు

గజపతినగరం జూలై 9 (ఆంధ్రజ్యోతి): అధికార, ప్రతిపక్ష నేతలు ఏకమై ఇసుకను తోడేస్తున్నారు. చంపావతి నది, ఏడోంపుల గెడ్డలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలకు తెగబడుతున్నారు. ఉచితం పేరిట ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకుపోతున్నారు. అధికార, ప్రతిపక్ష నేతలు ఒక్కటికావడంతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీనివల్ల వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఇదీ గజపతినగరం మండలంలో జరుగుతున్న ఇసుక దందా తీరు. తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీకి చెందిన ఇద్దరు నేతలు ప్రతిరోజూ ఇరవై ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అర్ధరాత్రి యంత్రాలతో వచ్చి ఇసుకను తవ్వి సమీప తోటలు, పొలాల్లో నిల్వ చేస్తున్నారు. అనంతరం స్థానిక అవసరాల కోసమని చెప్పి ట్రాక్టర్లతో పట్టణ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తీరానికి (మిగతా 8వ పేజీలో..)

తుమ్మికాపల్లి కేజీబీవీ ఖాళీ

- ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థినులు
- రెండోసారి అగ్నిప్రమాదం జరగడంతో..
- విద్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్



ప్రమాదం జరిగిన గదిలో విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కొత్తవలస, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అగ్ని ప్రమాదాలు జరగడంతో భయంతో విద్యార్థినులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో కేజీబీవీ ఖాళీ అయ్యింది. మంగళవారంరాత్రి కేజీబీవీలో మరోసారి అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఆరో తరగతి విద్యార్థి ముమ్మన పూర్ణిమ, ఏడో తరగతి విద్యార్థిని కె.భూమిక ఆందోళన చెంది స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వారిని పాఠశాల సిబ్బంది కొత్తవలస పీహెచ్‌సీకి తరలించగా, వైద్యాధికారిణి సీతల్‌వర్మ చికిత్స అందించారు. అగ్ని ప్రమాదాలతో భయాందోళనకు గురైన విద్యార్థినులు రాత్రికి రాత్రే పాఠశాలను వదిలి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 280 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరిలో 279మంది విద్యార్థినులను మంగళవారం రాత్రి వారి తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లిపోయారు. ఒకవిద్యార్థిని మాత్రం బుధవారం ఉదయం తన తల్లిదండ్రుల వెంట ఇంటికి వెళ్లింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం అర్ధరాత్రి12గంటల సమయంలో ఎమ్మెల్యే లలితకుమారి పరామర్శించారు. విద్యార్థినులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, డీఈ సురేష్ బాబు, ఇతర విద్యుత్ శాఖాధికారులు ప్రమాదం జరిగిన గదిని పరిశీలించారు. ఎక్కడా షార్టు (మిగతా 8వ పేజీలో..)

శభాష్ సిద్ధూ!

- ఇంటర్ యువకుడి మదిలో సరికొత్త ఆవిష్కరణ
- బ్యాటరీ సైకిల్ మీద రోజూ కళాశాలకు..
- అభినందించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- ప్రోత్సాహకంగా రూ.లక్ష అందజేత

తెర్లాం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి కుర్రోడు. ఇంటి నుంచి కాలేజీకి వెళ్లేందుకు అయ్యే ఖర్చును కూడా భరించలేని పరిస్థితి. బస్సులు, ఆటోల్లో వెళ్తూ సకాలంలో కాలేజీకి చేరుకోలేక పోతున్న ఆ కుర్రాడి మదిలో పుట్టుకొచ్చింది కొత్త ఆవిష్కరణ. తనకున్న సైకిల్‌కు బ్యాటరీని అమర్చి తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే మార్గానికి శ్రీకారం చుట్టాడు. మూడు నెలలుగా బ్యాటరీ సైకిల్ మీద కళాశాలకు వెళ్తున్న ఆ కుర్రాడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టిలో పడ్డాడు. పవన్ కల్యాణ్ ఆ కుర్రాడిని అమరావతి రప్పించుకున్నారు. బ్యాటరీ సైకిల్ వెను కూర్చుండబెట్టుకుని స్వయంగా నడిపారు. లక్ష రూపాయుల ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఆ యువకుడే తెర్లాం మండలం పూనువలస పంచాయతీ పరిధిలోని జె.కొత్తవలస గ్రామానికి చెందిన రాజాపు సిద్ధు. తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, సింహాచలం. వీరు దినసరి కూలీలు.

● తెర్లాం మండలం రాజాపు వలసకు చెందిన సిద్ధు రాజాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. కళాశాలకు రానుపోను 40 కిలోమీటర్ల దూరం కావడం.. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఆటోలు, బస్సుల్లో వెళ్లి వచ్చేందుకు నానా అవస్థలు పడేవాడు. రోజూ రూ.60 నుంచి రూ.70 ఖర్చు అయ్యేది. దీంతో తన తెలివితేటలకు పదునుపెట్టాడు. తల్లిదండ్రులు, బంధుమిత్రుల నుంచి రూ.30 వేలు సేకరించి రాజస్థాన్, ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో సైకిల్ మోడిఫికేషన్‌కు సంబంధించిన మెటీరియల్ తెప్పించుకున్నాడు. తన స్నేహితుడి సహకారంతో గతంలో పాఠశాల స్థాయిలో సైన్స్ పరంగా ఉన్న అనుభవాన్ని జోడించి బ్యాటరీ సైకిల్‌కు రూపకల్పన చేశాడు. దీంతో రోజుకు రూ.6 ఖర్చుతో సుమారు 80 కిలోమీటర్లు ప్రయాణించేందుకు వీలుగా వాహనాన్ని సిద్ధం చేసుకున్నాడు. మూడు గంటలు చార్జ్ చేస్తే 80 కిలోమీటర్లు నడిచే ఈ వాహనాన్ని చూసిన వారంతా తమకూ ఒకటి తయారు చేయాలంటూ సిద్ధు వెంటపడుతున్నారు.



సిద్ధు తయారుచేసిన బ్యాటరీ సైకిల్‌ను నడుపుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్

నేడు మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

గంట్యాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్ జరగనుంది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ సమావేశం జరగనుంది. దీన్ని విజయవంతం చేసేందుకు 17 కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,232 పాఠశాలల నుంచి 2,10,377 మంది విద్యార్థులు, 180 జూనియర్ కళాశాలల నుంచి 38,478 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా హాజరుకానున్నారు. విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశామని డీఈవో మాణిక్యంనాయుడు తెలిపారు.

రాజాంలో తాగునీటి కష్టాలకు చెక్

- రూ 63.7 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

రాజాం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పనున్నాయి. నాలుగు మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సీడబ్ల్యూ, సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా ఏకంగా రూ.63.7 కోట్లు కేటాయించింది. రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో తాగునీటి కష్టాలను తొలగించేందుకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సుమారు రూ.100 కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో అంచనాలు తయారు చేయించి ప్రభుత్వానికి అందజేశారు. ప్రభుత్వం స్పందించి రూ.63.7 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం, రాజాం మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాల్లో జనాభాకు తగ్గట్టు తాగునీరు సరఫరా కావడం లేదు. దశాబ్దాల కాలంనాటి పైపులైన్లే ఇప్పటికీ ఉన్నాయి. దీనికి తోడు రోడ్ల విస్తరణతో ఎక్కడికక్కడే పైప్ లైన్లు ధ్వంసమయ్యాయి. దీంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడంలేదు. ప్రస్తుతం నాలుగు మండలాలకు సంబంధించి ఐదు వరకు తాగునీటి పథకాలు ఉన్నాయి. వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నిధులు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది.

చిరుజల్లులతో సరి

- జిల్లాలో కురవని భారీ వర్షాలు
- 27 మండలాల్లో లోటు వర్షపాతం
- ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆందోళన



విజయనగరం కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఒకటి రెండు కాదు ఏకంగా పది రోజుల పాటు జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. కానీ, ఒక్కరోజు కూడా భారీ వర్షం పడలేదు. అంతా చిరుజల్లులే కురిశాయి. ఈ పది రోజులూ దట్టమైన మేఘాలు ఏర్పడడం.. చిన్న జల్లులు పడి ఆగిపోవడం కనిపించింది. దీంతో జిల్లాలో లోటువర్షపాతం నెలకొంది. ఫలితంగా వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే ఖరీఫ్ సాగు కష్ట మేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు రావడంతో మే నెల చివరి వారంలో జిల్లాలో భారీ వర్షాలు పడ్డాయి. దీంతో గతానికి భిన్నంగా మేలో అధిక వర్షపాతం నమోదైంది. జూన్ వచ్చేసరికి సీన్ రివర్స్ (మిగతా 8వ పేజీలో..)

కార్మిక హక్కులను హరించడం దుర్మార్గం

- జిల్లాలో వివిధ సంఘాల ర్యాలీ

విజయనగరం దాసన్నపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించడం దుర్మార్గమని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలో కార్మిక సంఘాలు బుధవారం సార్వత్రిక సమ్మె చేపట్టాయి. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కోట జంక్షన్ నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మల్టీ నేషనల్ కంపెనీలు, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి సంఘటిత కార్మిక వర్గం లేకుండా చూడాలని (మిగతా 8వ పేజీలో..)




విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

నేర ప్రవృత్తి ఉన్న వ్యక్తులపై నిఘా

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై9 (ఆంధ్రజ్యో తి): జిల్లాలో నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంతర నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించాలని, శక్తి టీమ్స్ మరింత విస్తృతంగా పనిచేయాలని అన్నారు. 'అదృశ్యం కేసుల్లో వ్యక్తులను ట్రేస్ చేసేందుకు చర్యలు చేపట్టాలి. నేరాల నియంత్రణకు పోలీసు స్టేషన్ల (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న ఎస్పీ

నిర్దేశిత జోన్లలోనే వీధి విక్రయదారులకు అవకాశం:కమిషనర్
భార్య మందలించిందని భర్త ఆత్మహత్య
7 లో

సింహ'గిరి ప్రదక్షిణ'కు పోటెత్తిన భక్తులు
6 లో



మడ్డువలసలో చిక్కుకున్న మత్స్యకారులు

- గుర్రపు డెక్కలో ఇరుక్కుపోయిన నాటు పడవ
- ఆందోళనలో కుటుంబ సభ్యులు

వంగర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్‌లో బుధవారం సాయంత్రం చేపలవేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు దాసరి రాము, దాసరి ఆదినారాయణ అందులో చిక్కుకున్నారు. మడ్డువలస గ్రామానికి చెందిన వీరు వరుసకు తండ్రీకుమారులు అవుతారు. వీరిద్దరూ నాటు పడవపై చేపల వేటకు వెళ్లి రాత్రివరకూ ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడి గ్రామస్థులకు చెప్పారు. వెంటనే పలువురు మత్స్యకారులు నాటు పడవలతో రిజర్వాయర్‌లో వారి కోసం వెతకడం ప్రారంభించారు. రాము, ఆదినారాయణ వెళ్లిన పడవ రిజర్వాయర్ మధ్యలో గుర్రపుడెక్కకు చిక్కుకుని ఉన్నట్లు గుర్తించారు. గుర్రపుడెక్క దట్టంగా ఉండడంతో నాటు పడవలు అక్కడకు వెళ్లడానికి వీలుపడలేదు. ఘటనా స్థలానికి ఇంజనీరింగ్ సిబ్బంది, పోలీసులు చేరుకుని మత్స్యకారులను బయటకు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా వారు వెళ్లారని, గతంలో కూడా ఇలాంటి ఘటనలు చాలావరకు జరిగాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంజిన్ బోటు లేనిదే వారి దరికి చేరడం కష్టమని పలువురు మత్స్యకారులు తెలిపారు.

సింహ'గిరి ప్రదక్షిణ'కు పోటెత్తిన భక్తులు

పూజలందుకుంటున్న సింహాద్రి అప్పన్న స్వామి


సింహగిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

సింహాచలం, జూలై 9(ఆంధ్రజ్యోతి): హరి నామస్మరణ నడుమ బుధవారం సింహ'గిరి ప్రదక్షిణ' ప్రారంభమైంది. ఆషాఢమాస శుక్లపక్ష చతుర్దశినాడు సింహగిరి చుట్టూ సుమారు 32 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ చేయడం అనాదిగా వస్తోంది. ఏటా మాదిరిగానే బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)కు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనంతో సింహాచలం గోశాల కూడలి నుంచి పాతఅడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక జంక్షన్ వరకూ రహదారి కిటకిటలాడింది.


ప్రదక్షిణలో ఉత్సాహంగా..


ఎండ, వానల నుంచి ఛత్రాలతో రక్షణ పొందేలా..


ప్రదక్షిణకు శ్రీకారం చుడుతూ తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు


ప్రదక్షిణలో పాల్గొన్న యువతరం


సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు


సింహాచలం తొలిపావంచా వద్ద స్వామివారి చెంత కుటుంబ సభ్యులతో కలిసి కొబ్బరికాయలు కొడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


కొండదిగువ ప్రాంతంలో సంచరిస్తున్న గజరాజులు

వదలని ఘీంకరింపు

- గిరిజనులను వెంటాడుతున్న ఏనుగుల భయం
- కొండపోడు పనులకు దూరం

సీతంపేట రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని గోరపాడు, మోహన కాలనీ, చినబగ్గ, బిల్లమడ, సుందర్యగూడ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు ఏనుగుల భయం వెంటాడుతోంది. గడచిన కొద్దిరోజులుగా మన్యంలో సంచరిస్తున్న గజరాజుల భయంతో గిరిజనులు కొండపోడు వ్యవసాయానికి దూరంగా ఉంటున్నారు. కొద్ది రోజులుగా గోరపాడు, మోహనకాలనీ గ్రామాల్లో తిష్టవేసిన ఏనుగులు ఆ ప్రాంతంలోని పంటలను నాశనం చేస్తున్నాయి. పైనాపిల్, చెట్టుపనస, అరటి, జీలుగు, అ రటి, మామిడి పంటలను ధ్వంసం చేస్తున్నట్టు చినబగ్గ పంచాయతీ సర్పంచ్ బి.నీలయ్య, గిరిజన రైతులు పూయక గురపన్న, మండంగి సోమయ్య, బి.బుద్దయ్య, బి.నాగేష్ తెలిపారు. ఏనుగుల భయంతో కొద్ది రోజులుగా కొండపైకి వెళ్లలేక పోతున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఎన్నిసార్లు అటవీ శాఖాధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు


వెదుళ్లవలసలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

గరివిడి, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. వెదుళ్లవలస గ్రామంలో బుధవారం సాయంత్రం తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, తారు రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలకు పూర్తిస్థాయిలో తరగతి గదుల నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కే.త్రిమూర్తులురాజు, టీడీపీ నేతలు పైల బలరాం, బలగం వెంకటరావు, సారిపాక సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన


పెదబూరాడపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బంగార్రాజు, రవిశేఖర్

నెల్లిమర్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని పెదబూరాడపేట, చిన బూరాడపేట, పారసాం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, మక్కువ రాజారావు, చింతపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలన'లో సమస్యపై స్పందించిన కర్రోతు


తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు

పూసపాటిరేగ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజుతో పాటు నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేశారు. ఈ తరుణంలో స్థానిక యాతపేటకు చెందిన ప్రజలు తమ ప్రాంతానికి తాగునీరు రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని తెలిపారు. దీనితో వెంటనే స్పందిచిన కర్రోతు స్థానిక పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీవోకు, మంచినీటి సరఫరా అధికారికి సమాచారమిచ్చారు. దీంతో అధికారులు అక్కడికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. దీనికి గాను పంచాయితీలో తగినంత నిధులు లేవని కార్యదర్శి తెలిపారు. అయితే మరమ్మతుల ఖర్చులు తాను భరిస్తానని మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు అధికారులకు తెలిపారు. వెంటనే మరమ్మతులను ప్రారంభించారు. నాలుగు రోజులలోగా తాగునీటిని అందించాలని బంగార్రాజు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకరరావు, తెలుగు యువత అధ్యక్షుడు పిన్నింటి కిషోర్, చందక ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసం సీఎం తపన

- ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

జామి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో తపిస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం జట్టేడివలస గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు మండల తెలుగు యువత అధ్యక్షుడు రాయవరపు శంకరరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ ఒక మహిళా ఎమ్మెల్యేపై వైసీపీ నాయకులు నీచంగా మాట్లాడడం దారుణమన్నారు. ఘోర పరాజయం ఎదురైనా వారిలో మార్పు రాలేదన్నారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, మండల పార్టీ కార్యదర్శి వర్రి రమణ, నాయకులు కొటాన విజయ్‌కుమార్, కృష్ణ, రామకృష్ణ, రాయవరపు సత్యవతి, బాదిరెడ్డి నారిబాబు, దనియాల పైడిరాజు పాల్గొన్నారు.


జట్టేడివలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల


జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లేఖలు రాసి చూపిస్తున్న జిందాల్ నిర్వాసితులు

మానవ హక్కుల కమిషన్‌కు జిందాల్ నిర్వాసితుల లేఖలు

శృంగవరపుకోట రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తమకు జిందాల్ కంపెనీ నుంచి రావాల్సిన హక్కులను కల్పించాలని కోరుతూ నిర్వాసితులు బుధవారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సామూహికంగా లేఖలు రాశారు. ఈ విషయమై జిందాల్ నిర్వాసితులు మట్లాడుతూ ఇప్పటి వరకు తమ గోడును మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టిలో పెట్టినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే మానవ హక్కుల కమిషన్‌కు లేఖలు రాస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ సమస్యలపై 1912కు సమాచారం ఇవ్వండి


మాట్లాడుతున్న ఎస్ఈ లక్ష్మణరావు

జామి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని ఆ శాఖ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన జామి విద్యుత్ ఉపకేంద్రంలో వినియోగదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా వినియోగదారులకు అందుబాటులో ఉండి.. సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ సురేష్, ఏడీ వెంకటరావు, ఏఈ జ్యోతిష్యరావు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో..


పాలకొండ: శాకంబరిదేవిగా దర్శనమిస్తున్న కోటదుర్గమ్మ అమ్మవారు

పాలకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాలకొండ కోట దుర్గమ్మ అమ్మవారు రెండో రోజు బుధవారం కూడా శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో కోటదుర్గమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో సహాయ అర్చకులు మణీల్‌శర్మ, ప్రసాదరావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి తోటలోని దుర్గమ్మ..

కొత్తవలస, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముసిరాం - దేవాడ గ్రామాల మధ్యలోని మామిడితోటలో వెలసిన తోటలో దుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవిని బుధవారం శాకంబరీఈ దేవిగా అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, విభిన్న రంగుల గాజులతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఏడువాక వెంకటరమణ మాట్లాడుతూ వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించనున్నట్టు తెలిపారు.

రాజాంలో నవదుర్గమ్మ..

రాజాం రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవదుర్గ అమ్మవారి దేవస్థానంలో నవదుర్గమాతతో పాటు జ్ఞానసరస్వతి అమ్మవారు శాకంబరులుగా భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవార్లను అలంకరించారు. మూడురోజుల పాటు ఇదే అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసరావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తవలస: శాకంబరిదేవి తోటలో దుర్గమ్మ



రాజాం రూరల్: శాకంబరిదేవిగా నవదుర్గ, జ్ఞానసరస్వతి అమ్మవారు

వినూత్నంగా ఆహ్వానించేలా..

శృంగవరపుకోట రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0కు విద్యాశాఖ వినూత్న ఏర్పాటు చేసింది. గురువారం జరుగనున్న ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించేందుకు చక్కటి ఫొటోఫ్రేమ్ లాంటిది ఏర్పాటు చేసింది. బొడ్డవర ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఇందుకూరి అశోక్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం దీనిని ఏర్పాటుచేసింది. పాఠశాలలోకి తల్లిదండ్రులు వచ్చేటప్పుడు పిల్లలు వీటిలో ఉండి.. వారిని ఆహ్వానించే విధంగా దీనిని రూపొందించారు. ఇది స్థానికులను ఆకట్టుకుంటోంది.

బొడ్డవర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫొటో ఫ్రేమ్ →



అదే పేరు.. మారని అధికారుల తీరు

సంతకవిటి, జూలై 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత హయాంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. వెంటనే పేరు మార్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కానీ అధికారులు మాత్రం పేరు మార్చకుండా వైసీపీ ప్రభుత్వంపై గల తమ అభిమానాన్ని ఇంకా చాటుకుం టున్నారు. సంతకవిటి మండలంలోని మం దరాడ, మండవకురిటి, తాలాడ తదితర గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలుగానే కొనసాగుతున్నాయి. అధికారుల తీరుపై కూటమి నాయకులు మండిపడుతున్నారు.



మందరాడ రైతు భరోసా కేంద్రంపై మారని పేరు


మండవకురిటిలో...

నిర్దేశిత జోన్లలోనే వీధి విక్రయదారులకు అవకాశం

కమిషనర్ నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్దేశించిన జోన్లలో మాత్రమే వీధి విక్రయాలు నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వీధి విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలో నిర్దేశించిన మూడు జోన్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్, గ్రీన్, అంబర్ జోన్‌లను ఏర్పాటు చేసి వీధి విక్రయాలకు వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. కలెక్టరేట్ జంక్షన్‌లో ఎస్పీ కార్యాలయం వరకూ, మయూరి కూడలి, అంబేద్కర్ కూడలి, ఎంఆర్ కళాశాల జంక్షన్ నుంచి రాజీవ్ స్టేడియం వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించారు. నగరపాలక సంస్థ కార్యాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, ఇన్ అండ్ అవుట్ సైడ్ గేటులు, కోట జంక్షన్ నుంచి గుమ్చీరోడ్డు, జిల్లా కోర్టు పరిధి ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడా వీధి విక్రయాలు కొనసాగించరాదని ఆదేశించారు. దాసన్నపేట, రైతు బజారు, బొంకులదిబ్బ, ఉడా కాలనీలు, వివేకానంద, అలకానంద కాలనీలు, ప్రదీప్‌నగర్, అంబేద్కర్ కూడలి, తోటపాలెం, బాబామెట్ట తదితర ప్రాంతాలను గ్రీన్‌జోన్‌గా ప్రకటించామన్నారు. ఈ ప్రాంతాల్లో వీధి విక్రయాలకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. మూడు లాంతర్ల జంక్షన్, లోవర్ ట్యాంకు బండ్ నుంచి ఐనాక్స్ వరకు, ఎస్‌బీఐ జంక్షన్ నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు అంబర్ జోన్‌గా ప్రకటించారు. గురజాడ స్కూల్ జంక్షన్ నుంచి గూడ్స్ షెడ్ రోడ్డు, గంటస్తంభం నుంచి కన్యకాపరమేశరి ఆలయం వరకూ, రైల్వేస్టేషన్, ఆర్ అండ్ బీ రోడ్డు, అంబటి సత్తర్వు రోడ్డులను అంబర్ జోన్‌గా ప్రకటించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఏసీపీలు హరిబాబు, రమణమూర్తి, ఎంహెచ్‌వో డాక్టర్ సాంబమూర్తి, కర్రోతు రాధామణి, సూర్యకుమారి, అంజనేయవర్ధన్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నెల్లిమర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తమను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేసేందుకు హామీలు ఇచ్చినా నెరవేరలేదని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఉద్యోగులను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమాన పనికి సమాన వేతనం, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్ఎంటీలు, పార్ట్ టైం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో వైద్యశిబిరాలు



గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

శృంగవరపుకోట రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దారపర్తి పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామాల్లో బొడ్డవర పీహెచ్‌సీ వైద్యురాలు మానస ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. సీహెచ్‌వో వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా వీడిపోయి గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 26 మందికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించడంతో పాటు వీరిలో ఇద్దరికి మలేరియా ఉండడంతో మందులు అందించారు. 8 మంది గిరిజన బాలురకు ఎనీమియా ఉన్నట్టు గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అందించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పల్లపుదుంగాడ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వెంకటరమణ, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, సింహాచలం, హెల్త్ అసిస్టెంట్లు రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. గోతులను పూడ్చారు

రాజాం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతుల కోసం పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద తవ్వి విడిచిపెట్టిన గోతులను అధికారులు పూడ్చారు. 'రోడ్డును తవ్వి.. నామమాత్రంగా పూడ్చి..' శీర్షికన గతనెల 29న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ గోతులు పూడ్చడంతో వాహనదారులు ఊరట చెందుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గోతులను పూడ్చిన దృశ్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి అభినందన



పీవీఎన్ మాధవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

రాజాం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్‌ను విజయవాడ కేంద్ర కార్యాలయంలో బుధవారం రాజాంలోని ఆ పార్టీ నాయకులు కలుసుకొని అభినందనలు తెలిపారు. రాజాం నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్‌లు కోరారు. అనంతరం ఆయనను సత్కరించారు. పార్టీ విస్తారక్ వేమకోటి గిరిబాబు, నాయకులు బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దైవానికి ప్రతిరూపం గురువు

విజయనగరం దాసన్నపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దైవానికి ప్రతి రూపం గురువుని సాయి సత్సంగ్ సేవా సంఘ్ వ్యవస్థాపకులు ఉపద్రష్ట వెంకట వరప్రసాద్ అన్నారు. బుధవారం తెలుగుభాషా పరిరక్షణ సమితి, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా పూల్‌బాగ్‌లోని కుసుమంచి ఫౌండేషన్ కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు పాత్ర చాలా కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో కుసుమంచి సుబ్బారావు, పులిపాటి రామారావు, ధవళ సర్వేశ్వరరావు, సముద్రాల గురుప్రసాద్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కుళాయిల్లో బురద నీరు

శృంగవరపుకోట రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీనివాస కాలనీతో పాటు వివిధ వీధుల పంచాయతీ కుళాయిల్లో బురదనీరు వస్తోంది. బుధవారం సాయంత్రం కొళాయిల నుంచి పెద్దఎత్తున బురదనీరు రావడం చూసి మహిళలు ఆందోళన చెందారు. విశాఖ-అరుకు రోడ్డులో జరుగుతున్న కాలువల వెడల్పు పనుల్లో తాగునీరు పైపులు దెబ్బతినడం వల్ల ఇలా జరిగి ఉండొచ్చని పంచాయతీ సిబ్బంది అంటున్నారు.

నేటి నుంచి బీఎల్వోలకు శిక్షణ

నెల్లిమర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 248 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి బూత్‌లెవిల్ అధికారులకు ఈ నెల 10 నుంచి 5 రోజులపాటు రోజుకు 50 మందికి ఈఆర్‌వో సూకరాజు ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతుందని ఆయన తెలిపారు.

జీతాలు చెల్లించండి

రాజాం రూరల్, జులై 9 (ఆంధ్రజ్యోతి): గతనెలలో బదిలీ అయిన ప్రభుత్వ ఉపాధ్యాయులలో చాలామందికి నేటికీ జీతాలు అందలేదని, తక్షణమే అందజేయాలని బహుజన్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేకేటి రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన రాజాంలో విలేకరులతో మాట్లాడారు. ట్రెజరీలలో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పదోతేదీ వచ్చినా జీతాలు రాకపోవడంతో చాలా మంది ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని రామారావు స్పష్టం చేశారు. ఆయనతో పాటు అనీల్ తండాది, సింహాచలం ఉన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రావణ్ కుమార్

సంతకవిటి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ ఎం.పి.డి.ఒ.గా ఎస్.శ్రావణ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయనగరం డీఎల్‌పీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

న్యూస్ బాక్స్

వెటర్నరీ కాలేజీకి గుర్తింపుపై హర్షం

విజయనగరం కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని వెటర్నరీ కాలేజీని కేంద్ర ప్రభుత్వం గుర్తించడంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడేందుకు తమ విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రిని, కార్యదర్శిని అభ్యర్థించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆ కళాశాలకు అనుమతిని మంజూరు చేయడం అభినందించాల్సిన అంశమని మంత్రి పేర్కొన్నారు. ఈ కళాశాలలో గతంలో మొదటి , రెండో సంవత్సరాల విద్యార్థులకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కల్పించింది. మూడు, నాలుగో సంవత్సరాల గుర్తింపునకు ఇప్పుడు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

13 వరకు అభ్యంతరాల స్వీకరణ

విజయనగరం కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకంలో రైతుల అభ్యంతరాలు స్వీకరణకు ఈనెల 13 వరకూ గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులో ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

'మెగా' సమావేశానికి ఏర్పాట్లు చేయండి

మెరకముడిదాం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్.. టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని ఎంఈవో ఎం.చంద్రశేఖర్ తెలిపారు. పండుగ వాతావరణంలా ఈ సమావేశం నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో 17 కమిటీలు ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఆహ్వాన కమిటీలు గ్రామంలోని తల్లిదండ్రులు, దాతలు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. తల్లిదండ్రులతో విద్యార్థి ఫొటో కోసం ఫొటోబూత్ ఏర్పాటు చేయాలన్నారు. సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగనున్న మెగా పేరెంట్స్ సమావేశానికి ఎమ్మెల్యే కళా వెంకటరావు హాజరు కానున్నారని తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బారికేడ్ల వితరణ

విజయనగరం క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు నగరంలోని మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి యాజమాన్యం బుధవారం బారికేడ్లు వితరణ చేశారు. ట్రాఫిక్ నిర్వహణను సులభతరం చేయడమే లక్ష్యంగా బారికేడ్లు వితరణ చేసినట్టు ట్రాఫిక్ సీఐ సూరినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, ఆసుపత్రి వైద్యులు డాక్టరు పద్మజ, డాక్టరు సుచరిత, మేనేజరు రవితేజ, సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం

విజయనగరం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విజయనగరం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం గురువారం సాయంత్రం 5 గంటలకు పార్టీ కార్యాలయంలో జరుగుతుందని నగర, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, అల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముఖ్యఅతిథిగా ఈ సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు

పూసపాటిరేగ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కందివలసలో గల సాయిబాబా మందిరం వద్ద గురుపౌర్ణమి పూజలకు ఏర్పాట్లు చేసినట్టు గురువు విజయరామయ్య, ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆలయ ప్రాంగణాన్ని బుధవారం పరిశీలించారు.

ప్రారంభమైన వరి నాట్లు

వేపాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైచర్ల సింగవరం, బానాది, బల్లంకి, భర్తవానిపాలెం, వీలుపర్తి, వేపాడ, వల్లంపూడి తదితర గ్రామాల్లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. నాట్లు వేసుకునే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి స్వాతి సూచించారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నగేష్ (ఫైల్)

భామిని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భామిని సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డోకులూగడకు చెందిన కొండగొర్రె నగేష్ (43) దుర్మరణం చెందారు. ఇసుకగూడకు చెందిన బిడ్డిక సంజీవ్ తీవ్ర గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనం అదుపు తప్పడమే ప్రమాదానికి కారణం. బత్తిలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం భామిని నుంచి ద్విచక్ర వాహనంపై కొండగొర్రె నగేష్, బిడ్డిక సంజీవ్ బయలుదేరారు. భామిని సమీపంలో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న దుంగలను ఢీకొని రోడ్డుపై పడ్డారు. దాంతో అక్కడికక్కడే నగేష్ మృతి చెందాడు. తీవ్రగాయాలపాలైన సంజీవ్‌ను స్థానికులు భామిని పీహెచ్‌సీకి 108 వాహనంలో తరలించారు. అక్కడి నుంచి సీతంపేటలోని ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బత్తిలి ఏఎస్ఐ కాంతారావు కేసు నమోదు చేశారు. నగేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య



అప్పలరెడ్డి (ఫైల్)

భోగాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దల్లిపేట పంచాయతీ గాలిపేటకు చెందిన దల్లి అప్పలరెడ్డి(38) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలివీ.. దల్లిపేటకు చెందిన దల్లి అప్పలరెడ్డికి అదే గ్రామానికి చెందిన ఎర్రమ్మతో 17 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి హేమలత అనే కుమార్తె ఉంది. అప్పలరెడ్డి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్యపై అనుమానం పెంచు కున్నాడు. మంగళవారం రాత్రి కూడా మద్యం తాగి.. ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మనస్థాపానికి గురైన అప్పలరెడ్డి ఇంటి నుంచి వెళ్లి పోయి.. గ్రామ సమీపంలోని ఓ లేఅవుట్‌లో కాము చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఎర్రమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితులకు జైలు

విజయనగరం క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో 2021లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది సాధారణ జైలు, రూ.51 వేల జరిమానా విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి బుధవారం తీర్పు వెల్లడించినట్టు డీఎస్పీ గోవిందరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నెల్లిమర్ల మండలం చినబూరాడపేట గ్రామానికి చెందిన యడ్ల మహాలక్ష్మికి గజపతినగరానికి చెందిన ఎన్ని రామకృష్ణతో 2019లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.8 లక్షల కట్నం, 4 తులాల బంగారు వస్తువులు, రూ.50 వేల విలువైన సారె సామగ్రిని కన్నవారు ఇచ్చారు. వివాహం అనంతరం భర్త రామకృష్ణ, అతని తల్లిదండ్రులు చిన్నయ్య, సత్యవతిలు అదనంగా రూ.2 లక్షలు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా మహాలక్ష్మిని వేధించారు. దీంతో ఆమె మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్టు డీఎస్పీ గోవిందరావు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

నెల్లిమర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను వంచించి.. తరువాత ముఖం చాటేసిన జరజాపు పేటకు చెందిన కోరాడ యశ్వంత్ కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.గణేష్ బుధవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న తనను రెండేళ్ల కిందట నిందితుడు యశ్వంత్ కుమార్ పెళ్లి చేసుకుంటానని నమ్మించినట్లు బాధితురాలు ఆ ఫిర్యాదులో పేర్కొంది. రెండేళ్లుగా తనతో శారీరక సంబంధం కొనసాగించి.. ఇటీవల ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో వివాహానికి నిశ్చితార్థం చేసుకున్నట్టు తెలిపింది. మూడు రోజుల నుంచి ఆ వ్యక్తి పరారీలో ఉన్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడు యశ్వంత్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

3,250 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

సాలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెద్దబజారులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టణ సీఐ బి.అప్పలనాయుడు పట్టుకున్నారు.బుద్దేపు సురేష్‌కకు సంబంధంచన షాపులో తనిఖీ చేస్తుండగా 77 బస్తాలుగా సుమారు 3,250 కే జీల బియ్యం ఆయన గుర్తించారు. బియ్యం కోసం సీఐ ప్రశ్నించడంతో సాలూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి కొనుగోలు చేశానని వ్యాపారి బదులిచ్చారు. దాంతో బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలి

రాజాం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లోకి వెళ్లి.. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను, వైఫల్యాలను వివరించాలని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక ప్రయివేటు కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన రాజాం నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అన్నిరంగాలలో వైఫల్యం చెందిందన్నారు. రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా.తలే రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

రాజాం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి పిలుపు మేరకు బుధవారం ఆ పార్టీ నాయకులు సంవిధాన్ బచావో రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం చేపట్టారు. మాధవ్‌బజార్ రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుంచి పాలకొండ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కుప్పిలి చైతన్యకుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్, విజయనగరం, చీపురుపల్లి, ఎస్.కోట పార్టీ ఇన్‌ఛార్జిలు సామినేని శ్రీనివాస్, గేదెల తిరుపతిరావు, రామచంద్రరాజు, జిల్లా అధికార ప్రతినిధి బంగారునాయుడు, మువ్వల శ్రీను, బెవర సత్యంనాయుడు, కనకల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

విజయనగరం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేద్దామని విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు అన్నారు. బుధవారం ఆయన నివాసంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కలసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సూచనల మేరకు ఈ నెల 24 తరువాత ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చంద్రినాయుడు, డైరెక్టర్లు ఆమోలు అప్పలనాయుడు, వర్రి సంతోషి, సుంకరి సన్యాసప్పడు, చింతపల్లి రమణ, వెలిచేటి మణికుమారి, సాగి సాయిరామరాజు, చందక తాతయ్యలు, ఎం.దేవీశ్రీ, ఎల్.గౌరి, ఎన్.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌తో దివ్యాంగులకు బంగారు భవిష్యత్

పూసపాటిరేగ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పారా స్పోర్ట్స్ ద్వారా దివ్యాంగులకు బంగారు భవిష్యత్ ఉందని అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. బుధవారం దివ్యాంగుల కోసం కోనాడ జంక్షన్‌లో నిర్వహిస్తున్న క్యాంపస్ ఛాలెంజ్ స్వచ్ఛంద సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారరు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణశర్మ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యం అమలులో నిర్లక్ష్యం వద్దు

విజయనగరం రింగురోడ్డు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంపూర్ణ పారిశుధ్యం అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య హెచ్చరించారు. ఆయన ఆదేశాలతో ఎంహెచ్‌ఓ డాక్టరు సాంబమూర్తి పారిశుధ్య పనుల తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి పూట జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాల తీరును ఆరా తీశారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో ని ఒక దుకాణ సముదాయంలో రహదారిపై విచ్చలవిడిగా చెత్తాచెదారాలు పడవేయడాన్ని గమనించారు. సంబంధిత దుకాణ యాజమానికి అపరాధ రుసుం విధించాలని పారిశుధ్య పర్యవేక్షకులను ఆదేశించారు.

కార్మిక సంక్షేమానికి కృషి చేయండి



చీపురుపల్లి: మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాజాం రూరల్: నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కార్మికులు



నెల్లిమర్లలో...



కొత్తవలసలో జూట్ కార్మికులు...

లేబర్ కోడ్‌లు రద్దుచేసి... కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కార్మిక సంక్షేమానికి కృషి చేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు, ఆశాలు, మున్సిపల్ వర్కర్స్, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు.. మానవహారాలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం

ఇసుక తోడేస్తున్నారు

(ఐదో పేజీ తరువాయి)



వినతిపత్రం అందజేస్తున్న తుమ్మికాపల్లి రైతులు (ఫైల్)

ఆనించి ఇసుక తవ్వకాలు చేపట్టడంతో సమీప పొలాలు నదిలో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా చంపావతి నది నుంచి తుమ్మికాపల్లి, కెంగువ, పురిటిపెంట, గంగచోళ్ల పెంట గ్రామాలకు చెందిన ట్రాక్టర్లతో, ఏడొంపుల గెడ్డ నుంచి ఎం.గుమడాం, లింగాలవల, కొత్తశ్రీరంగ రాజపురం గ్రామాలకు చెందిన ట్రాక్టర్లతో అధికంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఇసుకను తోడేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలతో చంపావతి, ఏడొంపుల గెడ్డ పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. సుమారు 3వేల ఎకరాలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. గతంలో నదిలో ఇసుక నిల్వలు ఉండడం వల్ల తేమ శాతంతో భూగర్భ జలాలు పెరిగి వేసవిలో తాగు,సాగునీటికి సమస్య ఉండేది కాదు. ప్రస్తుతం ఇసుకను పూర్తిగా తోడేయడంతో మట్టి కనిపిస్తుందని, దీనివల్ల సాగు, తాగునీటి సమస్య ఏర్పడిందని ఎం.గుమడాం, పురిటిపెంట, లింగాలవలస, గంగచోళ్లపెంట, కెంగువ, తుమ్మికాపల్లి తదితర గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తవ్వకాలతో తమ పంట పొలాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఇటీవల తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి తూతుమంత్రంగా దాడులు జరిపి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష నేతలు ఒక్కటైనప్పుడు తాము ఏమి చేయగలమని అధికారులు చేతులెత్తేస్తున్నారు.

చర్యలు తప్పవు

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవు. మొదటిసారి ట్రాక్టర్ పట్టుబడితే రూ.10 వేలు అపరాధ రుసుం విధిస్తాం. అదే ట్రాక్టర్ రెండో పర్యాయం పట్టుబడితే రూ.20 వేలు విధిస్తాం. ఎటువంటి అనుమతులు లేకుండా నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను తరలించరాదని ఇప్పటికే దండోరా వేయించాం. చంపావతి, ఏడొంపుల గెడ్డ పరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో పర్యవేక్షణ కొనసాగిస్తాం.

- బి.రత్నకుమార్, తహసీల్దార్, గజపతినగరం

తుమ్మికాపల్లి కేజీబీవీ ఖాళీ

(ఐదో పేజీ తరువాయి)

సర్క్యూట్ జరిగినట్టుగా లేదని వారు అన్నారు. ప్రిన్సిపాల్ విజయకుమారి మాత్రం షార్ట్ సర్క్యూటే కారణమంటున్నారు. స్విచ్ బోర్డుల నుంచి పొగలు వచ్చాయని, ఆ సమయంలో తరగతి గదిలో విద్యార్థినులు ఎవరూ లేరని, వెంటనే అగ్నిమాపక శాఖాధికారికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ అంబేడ్కర్ బుధవారం పాఠశాలకు వచ్చి పరిశీలించారు. విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడారు. రెండోసారి ప్రమాదం జరగక ముందు ఆ గదిలో ఉన్న అన్ని స్విచ్‌లు ఆపు చేశామని, షార్టు సర్క్యూట్ జరిగే అవకాశం లేదని ఎస్‌ఈ లక్ష్మణరావు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థినులు తరగతి గదుల్లోనే చదువుకుని, అక్కడే భోజనాలు చేసి అక్కడే నిద్రపోతున్నట్టు తెలుసుకుని కొంత అసహనం వ్యక్తం చేశారు. అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులు ఉమ్మడిగా ప్రమాదంపై విచారణ చేపట్టి నివేదికను అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థినులను మళ్లీ స్కూల్‌కు తీసుకొచ్చి ఎప్పటిలాగనే పరిస్థితులు కల్పిస్తామని అన్నారు. పిల్లల రక్షణ బాధ్యత తమదని అన్నారు. తల్లితండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పిల్లలందరినీ తిరిగి పాఠశాలకు పంపించాలని సూచించారు. గురువారం పేరెంట్ మీటింగ్ యథావిధిగా జరుగనుందని కలెక్టర్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పాఠశాలను సందర్శించారు. అగ్నిప్రమాదం గురించి ప్రిన్సిపాల్ విజయకుమారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, డీఎంహెచ్‌వో జీవన్‌రాణి, జిల్లా అగ్నిమాపక అధికారి రామ్‌కుమార్, ఎస్ఎస్ ఏఈఈ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బది'లీలలు'

(ఐదో పేజీ తరువాయి)

సొంత మండలానికి కాకుండా ఇతర మండలాలకు బదిలీ కావాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. అయితే, వ్యవసాయం, పశుసంవర్థక, పోలీసుశాఖ, ఇంజనీరింగ్, పంచాయతీరాజ్ తదితర విభాగాల్లో నిబంధనలు సక్రమంగా అమలు కాలేదని సంబంధిత ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. కౌన్సెలింగ్ సమయంలో వారు కోరుకున్న స్థానాన్ని పక్కన పెట్టి, వేరే చోటకు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి, గతంలో వారికి వచ్చిన ర్యాంకులను పరిగణనలోకి తీసుకుని మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ, ప్రజాప్రతినిధుల సిఫారసులు ఉన్నవారికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ విభాగానికి సంబంధించి మొదటిలో ఇచ్చిన బదిలీ ఆర్డర్‌లో ఓ స్థానం ఉంటే, రాత్రికిరాత్రే మరో చోటును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో ఆయా ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. దత్తిరాజేరు మండలంలోని ఓ సచివాలయంలో పని చేస్తున్న ఓ అగ్రికల్చర్ అసిస్టెంట్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకోకపోయినా ఆయనకు పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురానికి బదిలీ చేశారు. బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందంటూ కొందరు ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసేందుకు బుధవారం కలెక్టరేట్‌కు వచ్చారు.

మహిళా పోలీసుల నిరసన

గత నెల 30న జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని మహిళా పోలీసుల ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న సుమారు 170 మంది మహిళా పోలీసులకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిశీలన చేయకుండా వారికి కావాల్సిన స్థానాలు కేటాయించారని అన్నారు. జీవో నెంబరు 5 ప్రకారం సొంత మండలాల్లో పోస్టు ఇవ్వకూడదని, కానీ, చాలామందికి సొంత మండలాలనే కేటాయించారని ఆరోపించారు. అన్ని విభాగాల ఉద్యోగులకు గతంలో వారికి వచ్చిన జిల్లా ర్యాంకు ప్రకారం బదిలీలు చేశారని, కానీ, మహిళా పోలీసుకు మాత్రం స్టేట్ ర్యాంకును పరిగణనలోకి తీసుకోవడంతో తమకు అన్యాయం జరిగిందన్నారు. వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నేర ప్రవృత్తి ఉన్న వ్యక్తులపై నిఘా

(ఐదో పేజీ తరువాయి)

పరిధిలో ఆటో డ్రైవర్ల వివరాలు సేకరించాలి. నేర ప్రవృత్తి కలిగిన ఆటో డ్రైవర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలి. మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ఫిర్యాదులు వస్తే వెంటనే కేసు నమోదు చేయాలి. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా హైవేపై పెట్రోలింగ్ వాహనాలు చర్యలు చేపట్టాలి.' అని ఎస్పీ అన్నారు. వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యరెడ్డి, రాఘవులు, గోవిందరావు, వీర కుమార్, న్యాయసలహాదారు పరుశురామ్, సీఐలు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

బొబ్బిలి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సాగిందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. గొర్లెసీతారాంపురంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, సర్పంచ్ గొర్లి ఈశ్వరప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారంలో ఎమ్మెల్యే బేబీనాయన

నవధాన్యాలతో నేల సారవంతం

బొబ్బిలి రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలు సాగుతో నేల సారవంతమవుతుందని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. జగన్నాథపురంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంతో బుధవారం నవధాన్యాల పంట సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారాన్ని కోల్పోతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు ఈ నవధాన్యాలు సాగుతో లభిస్తాయన్నారు. ఈనేపథ్యంలో రైతులు సేంద్రియ ఎరువులతో సాగు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉపాధి పనులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న పీడీ శారదాదేవి

బాడంగి, జూలై9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ప్రభుత్వ ప్రతిపాదిత ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తెర్లాం, బాడంగి మండలాలకు చెందిన ఉపాధి సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఫాం పాండ్స్, హార్టికల్చర్, కంపోస్టు పిట్స్‌పై అంచనాలు వేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు శతశాతం పనులు కల్పించాలన్నారు. సీజనల్ వారీగా ప్రణాళిక తయారు చేసి అనుగుణంగా పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం, ఎస్‌ఎంటీ సుశీల, ఈసీ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక సంఘాలు



బొబ్బిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

బొబ్బిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెలో భాగంగా పట్టణంలో కార్మిక సంఘాలు బుధవారం కదంతొక్కాయి. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ జంక్షన్ నుంచి చర్చి సెంటర్ మీదుగా ఎన్టీఆర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించాయి. అక్కడ మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రధాని మోదీ మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెకు యూటీఎఫ్ నేత కె.విజయగౌరి మద్దతు పలికారు వివిధ సంఘాల నాయకులు శంకరరావు, దంతులూరి వర్మ, బోగాది అప్పలస్వామి, మునకాల శ్రీనివాసరావు, టి.అప్పలనాయుడు, పిల్లా లక్ష్మణరావు, కామేశ్వరి, నిర్మల, శాంతమ్మ, రామలక్ష్మి, ఉడమల ప్రసాద్, త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

భామిని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి సూచించారు. బుధవారం ప్రధానమంత్రి సురక్షా మాతృ అభియాన్ పరిశీలనలో భాగంగా బాలేరు పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. గర్భిణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ 49 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. సత్యసాయిబాబా సేవా సంఘం గర్భిణులకు భోజనాలు సమకూర్చారు..

●కొమరాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల వివరాలతో కూడిన రిజిస్టర్ సక్రమంగా ఉండాలని సిబ్బందిని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి ఆదేశించారు. బుధవారం మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తనూజ ఉన్నారు.

సబ్ జైలు పరిశీలన

పాలకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సబ్‌జైలును బుధవారం జిల్లా జైలు శాఖాధికారి కె.మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వసతి, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం జైలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జోగులు, హెడ్ వార్డెన్ విజయ్‌కుమార్, రమణ, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, డీపీటీ నాయుడు, నాగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

108, 104 వాహనాల తనిఖీ

పాలకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 108, 104 వాహనాలను ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ డిప్యూటీ ఈవో డి.నరేందర్ బుధవారం తనిఖీ చేశారు. పాలకొండ ఏరియా ఆసుపత్రిలోని నవజాత శిశు అంబులెన్స్‌లో మందులు, పరికరాలను పనితీరు, రికార్డులు పరిశీలించారు. వాహనాల కండీషన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి తీసుకువచ్చే సమయంలో ఇవ్వాల్సిన మెరుగైన చికిత్స విషయంలో సూచనలు చేశారు. కార్యక్రమంలో 108 రీజనల్ మేనేజర్ బాలరాజు, 104, 108 జిల్లా అధికారులు మన్మథనాయుడు, జిల్లా ఆపరేషన్ అధికారి గిరిబాబు పాల్గొన్నారు.

చిరుజల్లులతో సరి

(ఐదో పేజీ తరువాయి)

అయ్యింది. రోజూ మేఘావృతం కావడం.. ఆనక వర్షాలు ముఖం చాటేయడం పరిపాటిగా మారింది. గత నెలలో 112.1 మిల్లీ మీటర్లు వర్షం కురవాలి. కానీ, 97.4 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. 13 మిల్లీ మీటర్ల లోటు వర్ష పాతం నమోదైంది. జూన్‌లో లక్కవరపుకోట మండలంలో 88 శాతం, వేపాడలో 58.2శాతం, మెంటాడ మండలంలో 56.5 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. మిగిలిన 27 మండలాల్లో మాత్రం లోటు వర్షపాతం నమోదయ్యింది. ఈ నెలలో ఇంకా సరైన వానలు పడలేదు. జూన్ చివరి వారం నుంచి జూలై మొదటి వారంలోనే వరి విత్తనాలు చల్లుకునేందుకు అనుకూలం. కానీ, గత పదిరోజులుగా చిరు జల్లులు కురవడంతో పొలాలు బురదగా మారాయి. దీంతో రైతులు వరి విత్తనాలు చల్లుకోలేకపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది లక్ష హెక్టార్లలో వరి పంట వేసేందుకు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 40 వేల హెక్టార్లకు సంబంధించి మాత్రమే వరినారు పోశారు. ఇప్పటివరకు 46 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా చేశారు. మరో నాలుగు వేల క్వింటాళ్లు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో మూడు వారాల్లో వరి ఆకుమడులు అందుబాటులోకి వస్తాయి. అంటే ఈ లెక్కన ఈ ఏడాది ఆగస్టు వరకూ ఉభాలు జరిగే పరిస్థితి లేదు.

కార్మిక హక్కులను హరించడం దుర్మార్గం

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రం చూస్తుందని అన్నారు. సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ, ఏఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ సమ్మె కొనసాగింది. నాయకులు రెడ్డి శంకరరావు, రెడ్డి నారాయణరావు, అప్పలరాజు రెడ్డి, ఏబీజీవీబీ ఉద్యోగులు, బుగత అశోక్, రంగరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో సార్వత్రిక సమ్మె పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బ్యాంకులు యథావిధిగా పని చేశాయి.

బొబ్బిలి పట్టణ రోడ్లకు మరమ్మతులు

●సొంత నిధులతో చేయిస్తున్న ఎమ్మెల్యే



రోడ్డు మరమ్మతులు జరుగుతున్న దృశ్యం

బొబ్బిలి, జూలై9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో రోడ్ల మరమ్మతులకు ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం శ్రీకారం చుట్టారు. ఇందుకుగానూ ఆయన సొంత నిధులను వెచ్చించారు. రోడ్ల దుస్థితిపై వివిధ వర్గాల ప్రజల వినతుల మేరకు ఎమ్మెల్యే స్పందించారు. యంత్రాల సాయంతో పనులు చేయిస్తున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ లాలం రామలక్ష్మి, డీఈఈ కోరెడ్ల కిరణ్‌కుమార్, ఏఈలు గుప్త, కోటేశ్వరరావు, టీడీపీ శ్రేణులు పర్యవేక్షించారు.

ఏడాదిలో సుపరిపాలన



ఎమ్మెల్యే జగదీశ్వరిని సత్కరిస్తున్న స్థానికులు

జియ్యమ్మవలస, జూలై9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం బీజే పురం పంచాయతీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీరేశ్ చంద్రదేవ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కార్యక్రమంలో మరో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గుమ్మలక్ష్మీపురం, జూలై9 (ఆంధ్రజ్యోతి): జియమ్మవలస మండలం తుంబలి గ్రామానికి చెందిన బంకుపల్లి నరసింగరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.80 వేలు మంజూరయ్యాయి. బుధవారం సంబంధిత చెక్కును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం



కృష్ణరాయపురంలో ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, జూలై9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం కృష్ణరాయపురంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన మంచిని వివరించారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నమనాయుడు, నాయకులు ఆల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, జూలై9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిమ్మి, గడగమ్మ గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కావ్యశ్రీని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. బుధవారం కిమ్మి గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కిమ్మిలో మురుగునీటి కాలువల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఎరువులతో పాటు అదనంగా గుళికలు, జింక్ ఎరువులు కొనాలని డిమాండ్ చేస్తున్న డీలర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏవో సౌజన్యను ఆదేశించారు కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంధ్యారాణి, ఎంపీడీవో బి.వెంకటరమణ, తహశీల్దార్ సాయికామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

సురక్షిత ప్రసవాలే లక్ష్యం కావాలి

కొమరాడ, జూలై9 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా గర్భిణులకు వైద్య సేవలు అందించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సూచించారు. కె.ఆర్.బి.పురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలను మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించారు. గిరిశిఖర గ్రామాల గర్భిణులను ప్రసవ సమయానికి ముందుగానే వసతిగృహాల్లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సి.హెచ్.అరుణ్‌కుమార్, డాక్టర్ శిరీష, డాక్టర్ గణేష్ పట్నాయక్, వై.యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జగన్మోహన్

బీఎల్‌వోలకు శిక్షణ

బొబ్బిలి రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకమని తహసీల్దార్ ఎం.శ్రీను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోల మొదటి బ్యాచ్‌కు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధ్రువీకరణ పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు గల కారణాలను స్పష్టంగా తెలపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్, ఎలక్షన్ డీటీ గౌరీ శంకరరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీ

రామభద్రపురం, జూలై9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి త్రి సభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రామభద్రపురం సొసైటీ చైర్‌పర్సన్‌గా చొక్కాపు విజయలక్ష్మి, సొసైటీ డైరెక్టర్లుగా మహంతి ధనంజయ, అలాగే మామిడివలసకు చెందిన సువ్వాడ బలరాంను నియమించారు. బుధవారం బ్యాంకు సీఈవో చింతల వాసుదేవ్ సమక్షంలో ఆర్డర్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వసంతుల తిరుపతిరావు, భవిరెడ్డి చంద్ర, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కాపు రామారావు, బొబ్బిలి నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు మజ్జి రాము, బొబ్బిలి మాజీ సైనికుల అడ్వైజర్ తంటు సత్యారావు, నాయకులు వసంతుల వెంకటరావు, తెంటు ఉమా తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పొలిటికల్ గవర్నెన్స్

బొబ్బిలి, జూలై9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి రాగానే పొలిటికల్ గవర్నెన్స్ తీసుకువస్తామని పార్టీ అధినేత జగన్ స్పష్టం చేశారని జడ్పీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఓ కల్యాణ మండపంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మజ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. చంద్రబాబు మేనిఫెస్టోను అన్ని వర్గాల ప్రజలకు మరోసారి గుర్తు చేసి, ఆయన మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలోమాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తూముల భాస్కరరావు, శంబంగి వేణు గోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నపై అవగాహన

బొబ్బిలి రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): పారాదిలో బుధవారం రైతులకు ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ మొక్కజొన్న పంటపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న, పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతి, పురుగుల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు రేజేటి ఉష ఉన్నారు.

రోడ్లపై చెత్త వేయవద్దు

బొబ్బిలి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) - మండలంలోని మెట్టవలసలో బుధవారం ఎంపీడీవో రవికుమార్ చెత్త సేకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణ సరిగ్గా జరుగుతుందా లేదా అని పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను రోడ్ల ప్రక్కన కాలువల్లో వేయకుండా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తగా వేరు చేసుకొని పంచాయితీ నుంచి వచ్చే క్లాప్ మిత్రలకు ఇవ్వాలని సూచించారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

అదనపు భవనాల ప్రారంభం

పార్వతీపురం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అదనపు భవనాలను బుధవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.వి.నాయుడు, గొట్టాపు వెంకటరమణ, ఎంపీటీసీ తవిటినాయుడు పాల్గొన్నారు.